క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ సభ

నందవరం: మండలంలో 2021–2022 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సభ ఉంటుందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనుల కింద మొత్తం 492 పనులకు గానూ రూ.5,92,72,000 ఖర్చు చేశామన్నారు. సామాజిక తనిఖీల్లో ఒక ఎస్ఆర్పీ, 7 మంది డీఆర్పీలు పాల్గొని 12 రోజులు ఆయా గ్రామాలలో జరిగిన ఉపాధి పనులపై తనిఖీలు చేపట్టారన్నారు. బహిరంగ సభకు మండల అధికారులు, ఉపాధి సిబ్బంది, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు. ఏపీఓ మాలిక్‌బాషా, ఈసీ నూర్జహాన్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు


ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటి వద్దకే వైద్యం పథకంతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక బీరప్ప గుడి, కురువ వీధులలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఇబ్బందులు పడేవారికి వైద్య బృందం చికిత్సతో పాటు మందులు అందిస్తుందన్నారు. అలాగే ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ నిరంజన్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు, ఏఎన్ఎంలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7న యునాని వైద్య శిబిరం

గోనెగండ్ల: స్థానిక ప్రభుత్వ యునాని వైద్యశాలలో (ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణం) ఈనెల 7వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయుష్ యునాని వైద్యాధికారి డాక్టర్ ఖాద్రి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ జాతీయ యునాని దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక, జీవన శైలి జబ్బులకు చికిత్స అందించడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తామని వెల్లడించారు.

డాక్టరేట్ ప్రదానం

తుగ్గలి: విశాఖపట్నం ఆదివాసి అభివృద్ధి సంస్థలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న తుగ్గలి మండలం చెర్వుతండా రామనాయక్, లక్ష్మీబాయి దంపతుల కుమారుడు వడిత్యా మల్లికార్జున పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. గిరిజనుల ఉపప్రణాళికపై ఆయన చేసిన పరిశోధనకు గాను గతనెల 31న ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పత్తికొండ రూరల్: ఏలూరు జిల్లాలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీలకు పత్తికొండ బాలుర గురుకులంలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి భార్గవ్ కల్యాణ్ ఎంపికయ్యాడు. శుక్రవారం కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో విద్యార్థి ప్రతిభ చాటాడు. గురుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రెడ్డి, పీఈటీ సునీల్ విద్యార్థిని అభినందించారు.

వైభవంగా తెప్పోత్సవం


మద్దికెరలో ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర: మండల కేంద్రంలో వెలసిన ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణ స్వామి ఉత్సవమూర్తులకు శుక్రవారం స్థానిక మద్దమ్మ బావిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిందెసేవ, అష్టోత్తర నామార్చన, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులను తెప్పపై ఉంచి బావిలో తెప్పోత్సవం చేశారు. భక్తులు కనులారా వీక్షించి పులకించిపోయారు.

హుండీ ధ్వంసం చేసి చోరీ

హొళగుంద: మండల పరిధిలోని మద్దిలింగదహళ్లి (ఎం.డీ హళ్లి) గ్రామంలోని భీరలింగేశ్వర స్వామి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీని ధ్వంసం చేసి కానుకలను చోరీ చేసినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఆలయ తాళం పగులగొట్టి వరాండాలో ఉన్న ఇనుప హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న నగదు, కానుకలను దోచుకున్నట్లు తెలుస్తోంది. చోరీకి గురైన సొత్తు రూ.10 వేల వరకు ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.

గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి

- ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలి
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు

కృష్ణగిరి: నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు అవగాహన సమన్వయ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లతో కలిసి పని చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో ప్రజలకిచ్చిన హామీలను ఎండగడుతూ జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతఒక్కరికీ చేరే విధంగా కృషిచేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రతి అభివృద్ధి పనిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

చేసిన మంచి చెప్పి ఓట్లు అడుగుదాం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మేలును వివరించి ఓట్లు అడుగుదామని ఎమ్మెల్యే కంగాటి కార్యకర్తలకు సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లినప్పుడు గత టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను వివరించాలన్నారు. 175కు 175 స్థానాల్లో గెలుపొంది జగనన్న మాట నిలబెట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అందులో భాగంగా కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నియమించిన దాదాపు ఆరు వేల మంది తమ కుటుంబసభ్యులేనని, వారికి ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, నాయకులు మాధవరావు, బ్రహ్మానందరెడ్డి, రాములమ్మ, నాగరాజు, మహేశ్వరరెడ్డి, అంకాల మహాలక్ష్మి, కృష్ణయ్య, బేతాపల్లె రాజేశ్వరి, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్న నేలటూర్ గ్రామానికి చెందిన రామేశ్వరమ్మ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో పెంచికలపాడు విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో వృద్ధాప్య పింఛను అందుకోలేక పోయింది. ఆమె పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ వీరకుమార్ శుక్రవారం విశ్వభారతి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి పింఛన్ సొమ్ము అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామేశ్వరమ్మకు పింఛన్ సొమ్ము అందిందని, ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామేశ్వరమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ వీరకుమార్

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం ప్యాకెట్లను తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప తాలూకా అలబునూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. నరసింహ, రేవన్న అనే వ్యక్తులు బైక్‌పై మూడు బాక్సుల్లో 288 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా హెబ్బటం గ్రామ శివారులోని మఠం వద్ద పట్టుబడినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సెబ్ పోలీసులకు అప్పగించామన్నారు. అలాగే బైక్‌ను కూడా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ.. కనకవీడులో అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన లక్ష్మీకాంత రెడ్డి ఇంట్లో 75 విస్కీ టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కృష్ణగిరి: ఎరుకలచెర్వు ఉన్నత పాఠశాల సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీనివాసులును శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇతని వద్ద నుంచి 30 ఒరిజినల్ చాయిస్ టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కల్యాణ మండపం ప్రారంభోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన బసవేశ్వర కల్యాణ మండపాన్ని శుక్రవారం బిచ్చాల మఠమారి మఠాల పీఠాధిపతి వీరభద్రశివాచార్య స్వామి, రాష్ట్ర వీరశైవ లింగాయితీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ ప్రారంభించారు. పీఠాధిపతి మాట్లాడుతూ వీరశైవులు సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. కల్యాణ మండప నిర్మాణానికి సహకారం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

పత్తికొండ రూరల్: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకట్రాముడు అన్నారు. శుక్రవారం హోసూరు గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ.. శనగ పంట గురించి, పంట కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ యంత్ర సేవా పథకం కింద మంజూరైన ట్రాక్టర్, పంట నూర్పిడి యంత్రాలు పంపిణీ చేశారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ సలహామండలి సభ్యులు, గ్రామ సహాయకులు శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

20 తులాల బంగారం చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీ చివర చెరువు సమీపంలో ఉపాధ్యాయుడు షేక్ మహబుబ్‌బాషా ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. వివరాలు.. మహబుబ్‌బాషా కారుమంచి జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్నాడు. భార్య నసీమాబాను పట్టణంలో వీవర్స్ కాలనీ జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తోంది. శుక్రవారం ఇద్దరు విధులకు వెళ్లగా కుమారుడు సోహెల్ ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను తెరిచి 20 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఇంట్లోని ఇతర వస్తువులను ముట్టుకోలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన సోహెల్ తలుపులు తెరిచి ఉంటంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇంటి వద్దకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బీరువా తలుపులు తెరిచి చోరీ చేసిన దృశ్యం

తాడిపత్రి వృషభాల జయకేతనం


వెల్దుర్తి: మండల పరిధిలోని శ్రీరంగాపురం కొండల్లో వెలసిన కాశిరెడ్డినాయన ఆలయంలో 13వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం న్యూకేటగిరీ విభాగంలో వృషభాలకు నిర్వహించిన బండలాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన రమేశ్ యాదవ్ వృషభాలు నిర్ణీత సమయంలో రాతి దూళాన్ని 4,265 అడుగుల దూరం లాగి విజేతలుగా నిలిచి రూ.40 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. పోటీలను శ్రీరంగాపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలకృష్ణ, చిన్న కొలుములపల్లె లక్ష్మిరెడ్డి ప్రారంభించారు. ద్వితీయ స్థానంలో గుత్తి వన్నెదొడ్డి బేడల మద్దిలేటి, పెంచలపాడు రాకెట్ల భీమలింగప్ప వృషభాలు సంయుక్తంగా, 3వ స్థానంలో గుత్తి వూబిచెర్ల గోవిండ్, డోన్ కొత్తకోట తలారి కాంత్ వృషభాలు సంయుక్తంగా, 4వ స్థానంలో గోనెగండ్ల కైరవాడి లక్ష్మన్న వృషభాలు, 5, 6 స్థానాలలో బేతంచెర్ల హుసేనాపురం రామసుబ్బారెడ్డి వృషభాలు నిలిచాయి. 7వ స్థానంలో అనంతపురం మేకమాకులపల్లె తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు, 8వ స్థానంలో సోమలదొడ్డి వీరశేషారెడ్డి, దైవాలమడుగు సూర్యనారాయణరెడ్డి వృషభాలు సంయుక్తంగా, 9వ స్థానంలో కోడుమూరు కొత్తపల్లె దుబ్బన్న వృషభాలు నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు వరుసగా రూ.35 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలను దాతలు, నిర్వాహకులు సుంకిరెడ్డి, వెంకటేశ్, గోపాల్ తదితరులు అందించారు.

రాజీయే రాజమార్గం

గోనెగండ్ల: పరిష్కరించదగిన కేసుల్లో రాజీ కావడమే ఉత్తమ మార్గమని ఎస్ఐ తిమ్మారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గోనెగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యభర్తల గొడవలు, అక్రమ మద్యం, తదితర కేసుల్లో ఉన్న వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఘర్షణలకు పాల్పడే ముందు ఒక్క క్షణం ఆలోచిస్తే సమస్యల నుంచి బయట పడుతారని చెప్పారు. సమస్య వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు మురారి, రవి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ మల్లికార్జున సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్ ఉంటుందని కేసులు రాజీ చేసుకోవాలనుకునే వారు స్థానిక పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలన్నారు.


జాబ్‌మేళాకు విశేష స్పందన


నియామక పత్రాలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, అపార్డ్ ఎస్జీఓ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. దాదాపు 300 మంది నిరుద్యోగులు మేళాలో పాల్గొన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ సురేంద్రనాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ కుమారస్వామిరెడ్డి, రేఖరెడ్డి, అపార్డ్ కర్నూలు సీఈఓ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ మాధురి పాల్గొన్నారు.

ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠ

హొళగుంద: మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో శుక్రవారం తిమ్మప్ప (వేంకటేశ్వర స్వామి) ఆలయ నూతన గోపుర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. అంతకుముందు పంచ కలశాలను గ్రామంలో బీరప్ప డోళ్ల మధ్య నందికోలు ఆడిస్తూ గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో భాగంగా గంగిపూజ, గోపూజ, విష్ణు సహస్రనామ హోమాలు ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వాముల చేత గోపుర కలశ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేసి పూజలు నిర్వహించారు. రాత్రి భజన తదితర కార్యక్రమాలు జరిగాయి.


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న చిన్నారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దికెర: మండల కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ మహేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పత్తికొండ రూరల్: పత్తికొండ–చిన్నహుల్తి రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఆదోనికి చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఆదోని నుంచి పత్తికొండకు వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తున్నారు. ఈరన్న స్వామి ఆలయం సమీపంలో బండల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో సీమకు అన్యాయం

ఎమ్మిగనూరు: కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని, అంతేగాకుండా కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలపడంతో రాయలసీమ ఎడారిగా మారుతుందని రాయలసీమ ఐక్యవేదిక కన్వీనర్ నాగన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరులో రాయలసీమ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వంచారు. కృష్ణా ట్రిబ్యునల్ ఆమోదం లేకుండా ఎగువ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇస్తూ పోవడంతో రాయలసీయకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, కృష్ణా ట్రిబ్యునల్‌ను కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఖాజా, నల్లారెడ్డి, కృష్ణ, హరి, రామన్న, లింగన్న పాల్గొన్నారు.

బీసీ గురుకులం విద్యార్థినుల ప్రతిభ


పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించిన వారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వెల్దుర్తి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకులం విద్యార్థినులు పరుగు పందెంలో సత్తా చాటి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులు శ్రీవాణి, రాజేశ్వరి గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు విశాఖపట్నం, సింహాచలంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో (స్టేట్ మీట్) 10వ తరగతి విద్యార్థి శ్రీవాణి 800 మీటర్లు, 200 మీటర్ల విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించింది. 9వ తరగతి విద్యార్థి రాజేశ్వరి 100 మీటర్ల రేస్‌లో మొదటి స్థానం, 400 మీటర్ల రేస్‌లో మూడవ స్థానంలో నిలిచి బంగారు, కాంస్య పతకాలు సాధించింది. అలాగే పోటీల్లో పాల్గొన్న పలువురు ప్రశంసా పత్రాలు పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను, వారికి తర్ఫీదునిచ్చిన పీఈటీ షబానాను ప్రిన్సిపాల్ ఎస్.షబానా అభినందించారు.

కనుల పండువగా రథోత్సవం


మసీదుపురంలో లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హనుమప్పనాయుడు ఇంటి నుంచి స్వామివారికి నైవేద్యం పూర్ణకుంభంతో తీసుకొచ్చారు. పూజారి ఈరన్న పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి రథం భక్తుల హర్షధ్వానాల మధ్య ముందుకు సాగింది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవం


పూజలందుకుంటున్న కాశిరెడ్డి నాయన

వెల్దుర్తి: శ్రీరంగాపురం కొండల్లో కొలువైన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో శుక్రవారం ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. కాశిరెడ్డినాయన, కోటపేట ఆంజనేయస్వామితోపాటు పక్కనే కొలువైన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహస్వామికి పూజలు నిర్వహించారు. సమీపాన ఉన్న పాలుట్ల రంగస్వామిని దర్శించుకున్నారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా కాశిరెడ్డినాయనకు పల్లకీసేవ నిర్వహించారు. నందికోల సేవ, చెక్క భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కమనీయం.. కల్యాణోత్సవం

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ ఫారెస్ట్‌లో కొలువుదీరిన కౌలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి దంపతులు, తువ్వదొడ్డి ప్రేమనాథ్‌రెడ్డి దంపతులు ఉభయదారులుగా స్వామి అమ్మవార్ల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. అర్చకులు మురళి, విద్యాధర్ వేద మంత్రోచ్చరణతో కల్యాణోత్సవం నిర్వహించారు. ఈఓ బి.చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉతవమూర్తులకు గరుడ వాహన సేవ, లక్ష్మినారాయణ, నవగ్రహ హోమాలు అనంతరం శేషవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. పత్తికొండ సీఐ రామకృష్ణారెడ్డి, దేవనకొండ ఎస్ఐ భూపాలుడు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి మాట్లాడుతూ శనివారం రథ కలశ స్థాపన, 5న రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.


శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్తమ సేవలకు అవార్డు

వెల్దుర్తి: మండల పరిధిలోని వెల్దుర్తి–1 పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, గోవర్ధనగిరి–2 వెల్ఫేర్ అసిస్టెంట్ మహేశ్, నర్సాపురం డిజిటల్ అసిస్టెంట్ రియాజ్, ఉత్తమ సేవలకు గాను అవార్డులకు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఎంపికైన వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు చేతుల మీదుగా మెమొంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు.

శిలా తోరణం ప్రతిష్ఠ

హొళగుంద: వందవాగిలి గ్రామంలో శుక్రవారం బసవన్న ఆలయ నిర్మాణ పనులకు గాను శిలా ద్వారాల ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చెందిన రాజశేఖర్ స్వామీజీ కార్యక్రమానికి హాజరై శిలా ద్వారాల ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భక్తులంతా కలిసికట్టుగా ఉండి బసవన్న నూతన ఆలయ శిలా కట్టడ నిర్మాణం పనులను పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. వాల్మీకి కులపెద్దలు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టళ్ల తనిఖీ

కృష్ణగిరి: సీజనల్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం అందించాలని జీసీడీఓ సునీత నిర్వాహకులకు ఆదేశించారు. మండల పరిధిలోని ఆలంకొండ, చుంచుఎర్రగుడి గ్రామాల్లోని సీజనల్ హాస్టళ్లను శుక్రవారం రాత్రి ఆమె అలెస్కో శ్రీనివాసులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. అనంతరం కృష్ణగిరిలోని కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు మంచి భోజనం అందించడమే గాకుండా వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ట్యూటర్లతో విద్యా బోధన కల్పించాలన్నారు.

అవినీతి అధికారుల్లో గుబులు

ఎమ్మిగనూరు: పట్టణంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారనే ప్రచారం అధికారులను హడలెత్తించింది. మధ్యాహ్నం 1 గంట తరువాత పలువురు అధికారులు కార్యాలయాలకు రాకుండా మొహం చాటేశారు. రెండు రోజుల క్రితం ఆదోనిలో ఏసీబీ అధికారులు దాడులు చేయడంతో ప్రభుత్వాధికారుల్లో అలజడులు రేగాయి. అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ఏసీబీ బృందం వ్యూహాత్మకంగా చర్యలు చేపట్టడం, శుక్రవారం ఎమ్మిగనూరులో మకాం వేశారనే సమాచారంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు మధ్యాహ్నం 1గంట నుంచి ఆఫీసుకు రాలేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇంజినీరింగ్ శాఖ అధికారులు కూడా ఆఫీసు వదిలి వెళ్లిపోయారంటూ కిందిస్థాయి సిబ్బంది చర్చించుకుంటున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ శాఖ, రెవెన్యూ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎప్పుడైనా దాడులు జరుగొచ్చనే ప్రచారం అవినీతి అధికారుల్లో గుబులు రేపుతోంది. పలువురు బాధితులు అధికారుల తీరును ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్నా, కొందరు లంచాల వేటను వదలడం లేదు. ఈ విషయమై ఏసీబీలో పనిచేస్తున్న ఓ ప్రధాన అధికారిని సంప్రదించగా ఎమ్మిగనూరులో పలువురు కార్యాలయాలకు వెళ్లకుండా మొహం చాటేశారని తమకు కూడా సమాచారం అందిందన్నారు.

మండల ఉపాధ్యక్షురాలిగా సుశీలమ్మ


హరిజన సుశీలమ్మకు డిక్లరేషన్ అందజేస్తున్న ప్రత్యేకాధికారి చంద్రశేఖర్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ప్రత్యేకాధికారి డీఈ చంద్రశేఖర్ అధ్యక్షతన శుక్రవారం మండల ఉపాధ్యక్షురాలి ఎంపిక జరిగింది. మండల ఉపాధ్యక్షురాలుగా కలుగొట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ హరిజన సుశీలమ్మను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రత్యేకాధికారి డీఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ బంగారమ్మ ఆమెకు డిక్లరేషన్ అందించారు.

8 నుంచి గాయత్రీ మాత మహోత్సవాలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయిత్రీ మాత మహోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రూపామోహన్‌శర్మ శుక్రవారం తెలిపారు. ఆలయంలో 8వ తేదీన గంగ, గోవు, ఆకు పూజ, కంకణాధరణ, కుంకుమార్చన, 9న అభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళహారతి, పల్లకీ సేవ, 10న అభిషేకాలు, కలశ పూజ, గాయత్రీ యజ్ఞం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించునున్నట్లు చెప్పారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

గాయత్రీ మాత మహోత్సవాల సందర్భంగా ఈనెల 10వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రూపామోహన్‌శర్మ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10,116, తరువాతి స్థానాలకు వరుసగా రూ.8,116, రూ.6,116, రూ.4,116, రూ.2,116, రూ.1,516, రూ.1,116, ఎనిమిదో స్థానం వారికి గోడ గడియారం అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 94913 43707 నంబర్‌ను సంప్రదించాలన్నారు.